కథ

# 'ఇడియట్' బాక్స్!

- రామవరపు గణేశ్వరరావు

ఆటో ఆగిన చప్పుడు వినిపించి బాల్కనీలోకి వచ్చింది నిర్మల. ఆటోవాడికి డబ్బు ఇస్తూ కనిపించాడు నరసింహం. రెండడుగుల్లో వెళ్ళి, తలుపు తీసి గుమ్మం ముందు నిల్చుంది నిర్మల.

"ఏవిట్రా అన్నయ్యా! ఓ ఉత్తరం లేదు పత్తరంలేదు, ఉరమని పిడుగుల్లే పడ్డావ్!" చిరునవ్వు నవ్వుతూ అంది నిర్మల, నరసింహం యింకా మెట్ల మీద ఉండగానే.

నరసింహం సూటుకేస్‌ని ముందుగదిలో ఓ మూలన ఉంచి, సోఫాలో కూల బడ్డాడు. నిర్మల తలుపులుమూసి, వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి తెచ్చి ఇచ్చింది.



"నా సంగతి నీకు తెలీదా, నిమ్మీ! ఉత్తరం రాసి పదిరోజులు, టెలిగ్రాం ఇచ్చి మూడురోజులు అయింది. అన్నీ సిస్టమటిక్‌గా చేయాలనుకుంటాను. అయితే సిస్టమ్ అంటూ ఒకటి మనదేశంలో ఇప్పుడు ఉండి ఏడిస్తేగా!" అని నరసింహం అన్నాడు కాఫీ మధ్య మధ్య సిప్ చేస్తూ.

"మనిషి దిగిన మర్నాడు టెలిగ్రాం అందటం పాతజోకయి పోయిందిలే. అసలు ఇవ్వడమే మానేస్తున్నారు పోస్టువాళ్ళు. రైలు టైముకే వచ్చి నట్టుంది! ప్రతీ బండి వందనిమిషాలకు తక్కువ లేటు అవటం లేదు కదా అని, ఆరుకి తెలివి వచ్చినా, నిద్రలేవలేదు. ముందు స్టేషన్‌లో ఓ కుర్రాడు నన్ను నిద్రలేపబట్టి సరిపోయింది. ఇంతకీ వెంకట్ ఏడీ? ఇంకా నిద్ర లేవలేదా?" అన్నాడు నరసింహం కాఫీ కప్పు బల్లమీద ఉంచుతూ.

"ఆరుకే లేచాడు. దగ్గర్లో ఉన్న పార్కులో రౌండులు కొడుతుంటాడు. - మోడల్ ఫిగర్ కోసం అవస్థ!" అని నిర్మల నవ్వింది.

నిర్మలకి నరసింహం దూరపు బంధువు, వరసకి అన్నయ్య. అయితే ఇద్దరిదీ ఒకే ఊరు! నిర్మలకి పెళ్ళయి, నరసింహానికి ఉద్యోగరీత్యా, ఊరుమారాక కూడా ఇరువురి కుటుంబాల మధ్య రాకపోకలు సాగుతూ వచ్చాయి. నిర్మల మొగుడికి డయాబిటిస్ వ్యాధిముదిరి, హాస్పిటల్లో చేర్పించినప్పుడు, నరసింహం తన కుటుంబంతో వచ్చి నెలరోజులకి పైగా ఉండి, అన్ని విధాలా అండదండగా ఉన్నాడు. నిర్మల మొగుడు పోతే, నిర్మలకి ఉద్యోగం వచ్చేటట్లు, గవర్నమెంటు క్వార్టరు ఆమె ఉంచుకునే ఏర్పాట్లు చేసాడు. అది జరిగి నాలుగేళ్ళవుతోంది. నరసింహం చెల్లెలింటికి రావడం మళ్ళీ ఇప్పుడే! అతడికి ఇచ్చకాలు పనికి రావు, ముక్కుకు సూటిగా పోతాడు అందరినీ ఆదుకోవాలనే తత్త్వం.

"ఏమిటీ విశేషం? వదిన, పద్మ ఎలా ఉన్నారు? ఎందుకు వస్తున్నదీ ఉత్తరంలో రాసేఉంటావ్, అది అందలేదు. పోనీ ఇప్పుడు చెప్పు!" అడిగింది నిర్మల.

"ఏముంది, నాకు పెళ్ళికి ఎదిగిన కూతురుంది. పెళ్ళికావల్సిన కుర్రాడు నీకున్నాడు కదా!" అని నరసింహం సూటిగా అన్నాడు.

నిర్మల కాస్సేపు మాట్లాడలేదు.

"నా మట్టిబుర్రకు ఇది ముందే తట్టలేదని అనుకోకురా, అన్నయ్యా! మీ బావగారు పోయేనాటికి, వాడి గ్రేడ్యుయేషన్ అయింది, ఆ ఉద్యోగం వాడికే ఇప్పిద్దాం అంటే, 'వాడిని చదువుకోనీ' అని నువ్వే అడ్డం పడ్డావు."

"ఏదో జర్నలిజం గట్రా చేస్తానన్నాడే, అదేం చేయలేదా?" అని నరసింహం అడిగాడు.

"చేయకేం, కర్మ! ఏక్టింగ్ ఎడిటింగు, మోడలింగు అంటూ ఊర్లో ఉన్న కోచింగు, షాపుల్లో సవాలక్ష కోర్సులు చేసాడు. కాని వీడికి దొరికే ఉద్యోగాలకేమో వీడు వెళ్ళడు, వీడికి కావలసినవి వీడిదగ్గరకురావు!" అని నిర్మల నిట్టూర్చింది.

"ఇంతకీ ఏం చేస్తున్నాడు వాడు?"

"ఉద్యోగం అంటూ ఒకటి ఉంటేగా! అయినా నేను చెప్పడం ఎందుకూ, నువ్వే చూస్తావుగా! నా సమస్య ఏమిటో నీకే తెలుస్తుంది!" అని అంది నిర్మల. కాలింగ్ బెల్ మోగగానే, నిర్మల లేచింది.

"రారా, మావయ్య వచ్చాడు. ఇప్పుడే నీ గురించి అడిగాడు!" తలుపులు తీసాక అంది నిర్మల.

"అలాగా, అయితే ఓ వంద ఏళ్ళు నేను బతకటం గారంటీ! హలో, మామ్స్! ఎలా ఉన్నావ్, అత్తయ్యను పద్మను తీసుకురాలేకపోయావా!" అని అంటూ నరసింహానికి ఎదురుగా కూలబడ్డాడు.

'నువ్వు నన్ను అలా పిలిస్తే, ఈ కొత్త సోమర్‌సెట్ మామ్ ఎవరా అని జనం భయ పడే ప్రమాదం ఉంది రా, వెంకట్!" అని నరసింహం చిరునవ్వు నవ్వాడు

"తెలుగు 'మావయ్య'ను ఇంగ్లీషు చేసా, సరదాకి! ఏమనుకోకు"

"చూసావా, ఈ జోళ్ళు కూడా ఎలా ఊపిరి తీసుకుంటున్నాయో!" అని విప్పిన షూసు నేల మీద నొక్కి వదిలాడు వెంకట్.

మావయ్య మాట్లాడక పోవడం చూసి, "అమ్మ ఆఫీసుకి సెలవే కనుక, నీకు కంపెనీ ఇస్తుంది. నా అర్జెంటు పని పడింది, వెళ్ళాలి. సాయంత్రం కబుర్లు చెప్పుకుందాం!" అని అంటూ వెంకట్ లేచాడు.

వాష్ బేసిన్ ముందు టూత్ బ్రష్‌ను పళ్ళమీద అటూ ఇటూ తిప్పాక, నోట్లో లిక్విడ్ డ్రాప్ వేసుకుని, నీళ్ళతో పుక్కిలించి ఉమ్మాడు. వెనువెంటనే గదిలోకి గింగరాలు తిరుగుతూ వచ్చి, కుడి అరచేతిని నోటిముందుంచి "హ...హ" అని ఊదాడు. జెల్ ట్యూబ్‌ని విజిల్ వేస్తూ, బాత్‌రూంలోకి దూరి, రెండు నిమిషాల తర్వాత, 'మమ్మీ ఓసారి ఇలా వస్తావా!' అని తలుపు ఓరగా తెరిచి అరిచాడు.

వరండాలో నిల్చుని చూస్తున్న నరసిం హంతో "మరేం లేదు, మామయ్యా! నా వీపు నేను సరిగ్గా తోముకోలేను. అందుకే అమ్మను పిలిచాను. దిస్ పార్ట్ ఆఫ్ మై బాత్ ఈజ్ స్పాన్సర్డ్ బై మమ్మీ! "అని అంటూ లోనికి దూరాడు. నిర్మల అక్కడనుంచి బయటికి వచ్చిన తర్వాత, స్నానాలగదిలోంచి స్టీరియో బిగ్గరగా మోగసాగింది.

అదేమిటో అని ఆశ్చర్యపోతున్న నరసింహంతో, 'మరేం లేదు వాడికిష్టమైన సబ్బు పాడుతూ ఉంటాడు... పైన వాటర్ టేంకుంది. నీళ్ళు ఆగిపోవు, భయపడకు!" అంది నవ్వుతూ నిర్మల.

మావయ్య రైలు బట్టలు ఇచ్చి, ఇస్త్రీకిచ్చిన బట్టలు తెస్తానని వెంకట్ వెనక బాల్కనీలోకి వెళ్ళటం చూసి, నరసింహ ఇస్త్రీ చేసేవాడు ఇంట్లో ఎక్కడ దాక్కున్నాడా అని ఆశ్చర్యంతో అటు వేపు వెళ్ళాడు. వెంకట్ బాల్కనీ రేలింగుకు కట్టిన తాడు విప్పాడు. దాని రెండో చివర, కింద ఇంటి పెరట్లోని వేప చెట్టుకొమ్మకు ముడివేసి వేళ్ళాడుతోంది. ఒకచేత్తో బట్టలు, ఇంకో చేత్తో తాడు గట్టిగా పట్టుకుని, రేలింగ్ మీదనుంచి పిట్టగోడమీదకు టార్జాన్‌లా సర్రున దిగి, అక్కడనుంచి ఇంటి వెనకనున్న సందులోకి దూకాడు. అక్కడ భల్ల వేసుకుని, బట్టలు ఇస్త్రీ చేస్తున్నతనికి వెంకట్ చేష్టలు బాగా అలవాటయి నట్లుంది. మాసిన బట్టలందుకుని ఇస్త్రీబట్టలు పేపర్లో చుట్టి వెంకట్ చేతికి అందివ్వగానే, వాడు అదేరూట్‌లో తాడు సాయంతో వెనక్కి వచ్చాడు. ఇదంతా క్షణాల్లో జరిగింది. నరసింహం తెల్లబోయి చూస్తుండగా,

థండర్ ట్యూన్‌ని హమ్ చేస్తూ , కుడిచేతి బొటనవేలు వెనక్కి వాల్చి చూపిస్తూ, వెంకట్ బయటకు వెళ్ళాడు.

"చూసావుగా వెంకట్‌ని, వాడికి పట్టిన పిచ్చి ఏమిటో నీకు అర్థం అయిందనుకుంటా! వాడిని నీ అల్లుడిగా చేసుకుంటానంటే, అది నీ ఇష్టం, నా అభ్యంతరం లేదు. ఇంకో విషయం రా అన్నయ్యా! వాడికి ఏ అమ్మాయి ఒకంత నచ్చదు. మన పద్మ వాడికి ఐశ్వర్యారాయ్‌లా కనిపిస్తేనే, మనకోరిక తీరుతుంది!" అని అంది నిర్మల.

"ఏం చేస్తాం, ఇదంతా ఆ టి.వి ప్రభావం, ఇళ్ళపైనున్న ఆ తిరగవేసిన గొడుగుల మహిమ! ఇరవైనాలుగు గంటలూ హోరెత్తించేస్తున్నారు! ప్రచార చిత్రాలు చూసిన వాళ్ళంతా మన వాడిలా అవాలని లేదు, కొందరు అలా అయితే ఆశ్చర్యపోనూ అక్కరలేదు. ఆ మధ్య తాడుతో కొండమీదనుంచి కిందకి వెళ్ళాడి వాడికిష్టమైన డ్రింకు అందుకున్న మోడల్‌ని టి.విలో చూసి, ఓ కుర్రాడు మేడ మీదనుంచి దూకి చనిపోయాడట! అయితేనేం, బెస్ట్ అడ్వర్టయిజుమెంటు అవార్డు దానికే వచ్చింది!"

"అది సరే, అన్నయ్యా! మనవాడు ఇలాగే ఉండిపోతాడా, ఏమన్నా మారుతాడా?" అని నిర్మల ఆందోళన చూపింది.

"వాడి విషయం నా కొదిలెయ్! ఆదేవుని దయవలన డబ్బు ఇబ్బంది నీకు లేదు. వాడికిష్టమైన ఉద్యోగం వాడికి ఇప్పించగలను. ముందు నువ్వు సెలవు దొరకగానే మా వాడిని తీసుకుని ఊరొచ్చి కొన్నాళ్ళుండు." అన్నాడు నరసింహం.

మాటిచ్చిన ప్రకారం, నిర్మల కొడుకుతో నరసింహం ఇంటికి వెళ్ళింది. పద్మ సన్నగా పొడవుగా, అతినాజూకుగా ఉంటుంది. చెంపకు చేరడేసి కళ్ళు, కోల ముక్కు, తడారని గులాబీ రంగు పెదాలు. చందనరంగు వెంకటగిరి చీర కట్టుకుని, మేచింగు బ్లౌజు వేసుకుంది. తలంట పోసుకుని, వదులుగా జడవేసుకుని, మధ్యలో మందారాన్ని తురుముకుంది.



పద్మను చూస్తూనే వెంకట్ 'బౌల్డ్ ఓవర్' అయిపోయాడు. తల్లి చెవిలో, 'టి.వి. న్యూస్ రీడర్‌లా లేదూ?' అని అన్నాడు. నిర్మల అన్నయ్యతో, మావాడు న్యూస్ బులెటిన్లు మిస్‌కాడు, అది మిస్సమ్మలమీది శ్రద్ధ, న్యూస్ మీద కాదు! వారిని 'దేవతా స్త్రీలు' అని అంటాడు," అని చెప్తే, నరసింహం నవ్వి ఊరుకున్నాడు.

పాలపొడితో కలిపిన కాఫీ వారికి ఇచ్చాక, పద్మ డబ్బా మీద మూత మూస్తూ కుడిచేతి మునివేళ్ళతో సుతారంగా కొట్టింది.

"అమూల్య మిల్క్ పౌడర్, ఔనా?" అని వెంకట్ అంటే, పద్మ జవాబుగా చిరునవ్వు నవ్వింది.

వంటావార్పూ పద్మదే! ఆమె వడ్డిస్తుంటే, అన్నీ అడిగి మారువేయించుకున్నాడు వెంకట్.

"ఈ కాలీఫ్లవర్- బటానీ-పన్నీర్ల కూర బ్రహ్మాండంగా ఉంది. దీనికి ఈ రుచి ఎలా తెప్పించావ్!" అని వెంకట్ మూడువేళ్ళూ నేట్లో ఉంచి, లొట్టలు వేసి మరీ అడిగాడు.

పద్మ తన కుడిచేతి మధ్యవేలు మీద చూపుడువేలుంచి, కత్తెరలా ఆడించింది.

"టొమేటో ప్యూరీ! ఐ లైక్ ఇట్!" అని ఆనందంగా అరుస్తూ మళ్ళీ లొట్టలు వేశాడు.

వారం రోజులున్నారు తల్లీకొడుకులు. వెంకట్‌తో సినిమాలకి, షికార్లకి పద్మని తిరగనిచ్చాడు నరసింహం. వాళ్ళు కూడా వచ్చి కొన్నాళ్ళు తమతో ఉండేటట్లు మాట తీసుకుని మరీ వెళ్ళింది నిర్మల, కొడుకుతో.

తన అభిప్రాయం అడిగిన తండ్రితో, "బావకి దురలవాట్లు లేవు. సరదా మనిషి, జీవితాన్ని బంతిఆటగా తీసుకునే రకం! అలాంటివారితో ఎవరైనా సర్దుకుపోవచ్చు. సమస్యలకు తావు లేదు. ఇక అతనిపైనున్న బుల్లితెర ప్రభావం అంటావా- ఈ రోజుల్లో దానికి దాసులు కానివారెవరు?"- అంది పద్మ నవ్వుతూ.

తనకి ఈసారి వీలు కాక, కూతురిని, భార్యను చెల్లెలి ఇంటికి పంపాడు. పదిరోజులుండి వచ్చిన తల్లీకూతుళ్ళతో పాటు వెంకట్ వచ్చాడు.

"మావయ్యా, నాకు ఉద్యోగాల మీద నమ్మకం పోయింది. నేను ఎన్నుకున్న లైనులో స్థిరమైన ఉద్యోగం, సంపాదనా లేవు. ఆ రంగం మీద మోజు కూడా పోయింది. మైన్‌రోడ్‌లో నీ షాపుందని విన్నాను. అది ఖాళీ చేయించి నాకివ్వు!" అని నరసింహం తీరికగా ఉన్నప్పుడు వెంకట్ అడిగాడు.

"అలాగే! టివి షాపు పెట్టుకుంటావా? బిపిఎల్ వాళ్ళు నాకు తెలుసు. నీ పేర ఏజన్సీ తీసుకోనా?" అని నరసింహం అడిగాడు.

"అక్కర లేదు మామయ్యా! టీవీలు అమ్మే షాపులకి కొదవేం లేదు. అవి అమ్మడానికి బుర్ర ఉపయోగించనక్కరలేదు కూడా! నేను సూపర్‌బజార్ పెట్టి, తాజా కూరలు, పళ్ళు, పాలు, గుడ్లు లాటివి అమ్ముతాను!" అని వెంకట్ జవాబిచ్చాడు.

అతనిలో వచ్చిన మార్పుకి ఆశ్చర్యపోతూ నరసింహం కూతురితో మాట్లాడినప్పుడు, పద్మ తను ఈ పదిరోజుల్లో చేసిన ఘనకార్యం చెప్పింది..

"బావ అవసరాలు చూడమని అత్తయ్య అంది. మొట్టమొదట టి.విలో ప్రచార చిత్రాలు చూసి బావ మోజుపడి కొన్నవి- టూత్‌పేస్ట్ దగ్గర నుంచి ఒళ్ళు తోముకునే సబ్బు వరకు - అన్నీ తీసిపారేసి నాకిష్టమైనవి కొనిపెట్టాను. ఒకసారి మేం రోడ్డు మీద నడుస్తున్నప్పుడు, ఒక సోప్ కంపెనీ వేన్ వెళ్ళింది. వెంటనే ఆ సబ్బు కొని, కార్లు కడిగే పెట్రోలు బంకులో స్నానం చేద్దామని పంతం పట్టాను. బావ చేత బతిమాలించుకున్నాకే ఇంటికి వెళ్ళాను. వాక్‌మేన్ చెవులకు తగిలించు కొని వంట చేస్తూ, ప్రతి దానిలో మసాలాలు దట్టించేసరికి, బావ కడుపు పుండై పోయి, 'బాబోయ్, నీ టీవి వంటలు ఇక తినలేను' అని రెడీమేడ్ మసాలాలు కొనడం మానేశాడు. బట్టలు ఉతకమని ఇస్తే, బావకిష్టమైన వాషింగ్ పౌడరే వాడా. కాలరు మీది మరకలు పోలేదేమని బావ అడిగితే, "నేనేం చేసేది. టి.వి.లో చూపించినట్లే నానవేసి ఉతికి ఆరేసానుగా!" అని జవాబిస్తే బావ మళ్ళీ నోరెత్తలేదు. కాలవ ఒడ్డుకి షికారుకి వెళ్ళినప్పుడు, బోటు అద్దెకు తీసుకున్నాం. పక్క బోటు కన్నా జోరుగా పోనీయమని, కుడిచేయి ఎగరేస్తూ బావను హుషారు చేసా! ఉహు! నా చేయినొప్పితో పడిపోయింది కాని, బావ తెడ్లు వేయలేకపోయాడు. పైగా నీళ్ళలో పడ్డాడు. పక్కబోటు వారు బావను బయటకు లాగారు. జెల్ టూత్‌పేస్ట్ మళ్ళీ బావ వాడితే ఒట్టు! ఓసారి షాపింగు అయ్యాక, సిటీబస్సు ఎక్కి కిటికీ పక్క కూర్చున్నా.బస్సు వెనక పరుగెత్తుతూ బావను నా కోసం చాక్లెట్ విసరమన్నా, బావ విసిరింది బస్సుకు వెనక పది అడుగుల వెనక పడింది! అప్పుడు చూడాలి బావ ముఖం! ఇంకోసారి బావ క్రికెట్ ఆడుతుంటే, గ్యాలరీలో కూర్చున్నా. ఎంతకీ బావకి రన్స్ రావే! జండాకర్రలా క్రీజులో మాత్రం పాతుకుపోయాడు. చిట్టచివరికి ఓ సింగిల్ తీస్తే, ఆనందం పట్టలేక ఫీల్డులోకి పరుగెత్తి చాక్లెట్ తినిపించా. అందరూ నవ్వడం చూసి, బావ నన్ను కసురుకుంటే, టి.విలో చూపించి నట్లే చేశానని బావ నోటికి తాళం వేయించా. మొన్నటికి మొన్న ఇంటిముందు జరుగుతున్న గలాటా ఆపించమని బావని పంపితే రఫ్ అండ్ టఫ్ జీన్స్ వేసుకుని వెళ్ళి, అవి కాస్తా చింపుకుని వచ్చాడు. హీరోగారు జీరో అయాక టి.విని మొదటిసారి 'ఇడియట్ బాక్స్' అని అన్నాడు. బుల్లితెర మీద మోజు పోయి, బావ కళ్ళు తెరుచుకున్నాయి. ఇదీ కథ" పద్మ అంది నవ్వుతూ.

"ముల్లును ముల్లుతోనే తీయాలని అన్నట్లు, పిచ్చిని పిచ్చి నటించి ఒదలగొట్టావన్న మాట! అంతేలే! మనం చేసే పిచ్చిపనులు మనకి పిచ్చిగా అగుపించవే, అవే పనులు ఎదుటివారు చేస్తున్నప్పుడు, మన ప్రవర్తనలోని లోపం తెలిసొస్తుంది. అప్పుడు గాని మనం మారం!" అని నరసింహం హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు. ❐